క్లుప్తంగా

చిన్నారులకు బాక్సింగ్‌లో ఉచిత శిక్షణ



బాలుడికి బాక్సింగ్‌లో శిక్షణ ఇస్తున్న కోచ్

మల్కాపురం: వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా 15 ఏళ్లలోపు బాలబాలికలకు బాక్సింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు కోచ్ త్రినాథ్ యాదవ్ తెలిపారు. జింక్ క్రీడా మైదానం వద్ద రోజూ ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. శుక్రవారం మొదలైన శిక్షణ వచ్చే నెల 10వ తేదీ వరకు ఉంటుందన్నారు. ఆసక్తి గలవారు జింక్ మైదానం వద్దకు ఉదయం 6గంటలకు వచ్చి తనను సంప్రదించాలని సూచించారు. బాక్సింగ్ నేర్చుకోవాలనుకునే వారు తమ వెంట బాక్సింగ్ కిట్, దుస్తులు తెచ్చుకోవాలని తెలియజేశారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు

గోపాలపట్నం: టెక్ మహీంద్ర ఫౌండేషన్ సహకారంతో నిర్మాణ్ ఆర్గనైజేషన్ సంస్థ ఇంటర్, డిగ్రీ పూర్తయిన 18 ఏళ్ల నుంచి 28ఏళ్ల లోపు వయసు గల నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత శిక్షణ, ఉపాధి కల్పించనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ మయూర్ పట్నాల ఒక ప్రకటనలో తెలిపారు టైపింగ్ స్కిల్స్, ఎంఎస్ ఆఫీస్, ఇంటర్ నెట్ కాన్సెప్ట్, కమ్యూనికేటివ్ ఇంగ్లిష్, హెచ్‌టీఎంఎల్, సీఎస్‌ఎస్, ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్, టెక్నికల్ స్కిల్స్, బేసిక్ అకౌంటింగ్ కోర్సుల్లో 3 నెలల పాటు ఉచిత శిక్షణ ఇస్తామని తెలియజేశారు. శిక్షణ అనంతరం ఉపాధి అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఎన్‌ఏడీ జంక్షన్, బాజీ జంక్షన్‌లో గల నిర్మాణ్ ఆర్గనైజేషన్ కేంద్రంలో నేరుగా లేదా 99081 04113, 63041 59549 నంబర్లలో గానీ ఏప్రిల్ 20వ తేదీలోగా సంప్రదించాలని కోరారు.

ఘనంగా లక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవం

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు శ్రీనుబాబు నగర్‌లో లక్ష్మీగణపతి ఆలయ 25వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బెహరా భాస్కరరావు స్వామివారిని దర్శించుకుని, ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పార్టీ 92వ వార్డు అధ్యక్షుడు గొర్లె అప్పలస్వామి నాయుడు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన



శక్తి యాప్‌పై విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న పోలీసులు

పెందుర్తి: మహిళల రక్షణ కోసం ప్రభుత్వం రూపొందించిన శక్తి యాప్‌పై సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి.సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు పోలీసులు విస్తృతంగా ప్రచారం చేశారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని విద్యా సంస్థలు, కార్యాలయాల్లో మహిళలకు యాప్‌పై అవగాహన కలిగించారు. వారి సెల్‌ఫోన్‌లలో యాప్ డౌన్‌లోడ్ చేయించి దాన్ని వినియోగించే విధానాన్ని వివరించారు.

మందుబాబులకు జరిమానా

పెందుర్తి: పెందుర్తి ప్రాంతంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన 15 మందికి కోర్టు చెరో రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.1.50 లక్షలు జరిమానా విధించినట్లు పెందుర్తి ట్రాఫిక్ ఎస్ఐ నరసింగరాజు తెలిపారు. శుక్రవారం వీరందరినీ జిల్లా 2వ ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా జడ్జి పైవిధంగా తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ప్లస్ 2కు పెరుగుతున్న ఆదరణ





పాఠశాల గేటుకు ఏర్పాటు చేసిన బ్యానర్



ఇంటర్ తరగతులు నిర్వహిస్తున్న భవనం

గోపాలపట్నం: గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్లస్–2కు ఆదరణ పెరుగుతోంది. గత ప్రభుత్వ హయాంలో పాఠశాల అభివృద్ధి, విద్యాప్రమాణాల పెంపు, వసతుల కల్పనతో పాటు అధ్యాపకుల నియామకంతో చేరికలు పెరుగుతున్నాయి.

ఈ పాఠశాలలో 2022–23 విద్యాసంవత్సరంలో ఇంగ్లిష్ మీడియంలో ప్లస్–2 ప్రారంభమైంది. అప్పటి నుంచి ప్రతీ ఏడాది విద్యార్థుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. గతేడాది ఎంపీసీ విద్యార్థులు 24 మంది, బైపీసీ విద్యార్థులు 21 మంది మొత్తం 45మంది విద్యార్థులు ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసి, ఫలితాల కోసం నిరీక్షిస్తున్నారు. ఫస్టియర్‌లో 25 మంది ఎంపీసీ, 20 మంది బైపీసీ విద్యార్థులు, ఇప్పుడు రెండో ఏడాదిలోకి అడుగుపెడుతున్నారు.



శ్రద్ధగా పాఠం వింటున్న విద్యార్థులు

పెరుగుతున్న చేరికలు

పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరానికి చేరికలు పెరుగుతున్నాయని ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ తెలిపారు. గతేడాది ఆగస్టులో చేరికలు ప్రారంభం కాగా.. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అడ్మిషన్లు మొదలయ్యాయని చెప్పారు. ఇప్పటికే ఎంపీసీలో 7గురు, బైపీసీలో 8 మంది చేరారన్నారు. టెస్ట్ ఫలితాల అనంతరం మరింతమంది విద్యార్థులు చేరతారన్నారు. మూడేళ్లలో పాఠశాలలో ప్లస్–2 పలువురి మన్ననలు పొందిందన్నారు.

పూర్తి స్థాయి వసతులు

తరగతి గదుల్లో పూర్తిస్థాయి వసతులు కల్పించారు. ఈఎఫ్‌టీ ప్యానళ్ల ద్వారా బోధన విద్యార్థులకు ఆసక్తికరంగా ఉంటోంది. పుస్తకాలు, యూనిఫాం ఉచితంగా అందిస్తున్నారు. మధ్యాహ్న భోజన సదుపాయం ఉంది. గ్రంథాలయం అందుబాటులో ఉంది. ప్రతీ సబ్జెక్టుకు అధ్యాపకులు ఉండడం, పోటీ పరీక్షలకు కూడా శిక్షణ ఇవ్వడం విద్యార్థులకు కలసి వస్తోంది. దీంతో అడ్మిషన్లు పెరుగుతున్నాయి.

ఉత్తీర్ణత శతం పెంపునకు కృషి



పాఠశాలలో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత శాతం పెంచేందుకు కృషి చేస్తున్నాం. అయితే, ఇంతకు ముందు టెన్త్‌లో తక్కువ మార్కులు వచ్చినవారు, రెండోసారి పరీక్షలు రాసి పాసైన వారు చేరేవారు. వారికి చదువుపై ఆసక్తి కలిగించి, పాసయ్యే స్థాయికి తీసుకువస్తున్నాం. ఉత్తమ విద్యార్థులుగా మార్చుతున్నాం. ప్రాక్టికల్స్ కూడా వారంలో ఒక రోజు చేయిస్తున్నాం. దీంతో పాటు పోటీ పరీక్షలకు వెళ్లేలా ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నాం. మా కృషి ఫలిస్తోంది.

– పి రాధారాణి, జువాలజీ అధ్యాపకురాలు

కమ్యూనికేషన్ స్కిల్స్‌పై ఫోకస్



ఈ పాఠశాలలో అన్ని సౌకర్యాలు ఉన్నాయి. ఉచితంగా నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. విద్యార్థుల సందేహాలు తీర్చేందుకు అధ్యాపకులు అందుబాటులో ఉంటారు. పోటీ పరీక్షలకు రాయగలిగే విధంగా ప్రణాళికా బద్ధంగా బోధన జరుగుతోంది. ఆంగ్లంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం. కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందే విధంగా శిక్షణ ఇస్తున్నాం.

– ఆర్.మల్లికార్జునరావు, ఇంగ్లిష్ అధ్యాపకుడు

విద్యార్థుల చేరికలు పెరుగుతున్నాయి



పాఠశాలలో ప్లస్–2లో చేరికలు పెరుగుతుండడం చాలా సంతోషాన్నిస్తోంది. ఇందుకు అధ్యాపకుల కృషి ఎంతో ఉంది. కొత్తగా ఇప్పటికే 15మంది చేరారు. మరి కొంత మంది చేరతామని ఫోన్ ద్వారా సమాచారమిస్తున్నారు. ఎంతమంది చేరినా ఇక్కడ అన్ని సౌకర్యాలు ఉన్నాయి. గ్రంథాలయం కూడా ఏర్పాటు చేశాం. అన్ని పుస్తకాలు అందుబాటులో ఉంచుతున్నాం. ఇది విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుంది.

– ప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు జెడ్పీ హైస్కూల్

గొప్ప సంఘ సంస్కర్త పూలే

జయంతి వేళ నాయకుల నివాళులు



63వ వార్డులో పూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న సీపీఐ నాయకులు



షిప్‌యార్డ్‌లో పూలే చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న అసోసియేషన్ సభ్యులు

సింధియా: బలహీన వర్గాల ఆశాజ్యోతి, మహిళలకు విద్యావకాశం కల్పించిన గొప్ప సంఘసంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే అని వక్తలు కొనియాడారు. సమసమాజ స్థాపనకు కృషి చేసిన ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు.

● 63వ వార్డు పరిధి కాకరలోవ భగత్‌సింగ్ జంక్షన్ వద్ద సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుల ఆధ్వర్యంలో పూలే జయంతిని నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కాండ్రేగుల సత్యాంజనేయ, గుడాల రాంబాబు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆయన ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కామేశ్వరరావు, రంగీల అప్పారావు, బి.వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

షిప్‌యార్డ్‌లో..

హిందూస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ ఆవరణలోని సంస్థ మెయిన్‌గేటు వద్ద హెచ్‌ఎస్‌ఎల్ ఓబీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. పూలే సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఓబీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులతో పాటు షిప్‌యార్డ్ గుర్తింపు యూనియన్ నాయకులు, వివిధ గ్రేడ్ యూనియన్ నాయకులు, ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు, మాజీ సొసైటీ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కుక్కల స్వైర విహారం



సర్వీస్ రోడ్డులో దారి కాచిన వీధి కుక్కలు

ఫోకస్

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం పరిధిలో వీధికుక్కల స్వైరవిహారం ఎక్కువ అవుతోంది. ఇవి ఆ మార్గాన వచ్చే పాదచారులపై దాడి చేసి, గాయపరుస్తున్నాయి. ప్రధానంగా మల్కాపురం, గాంధీజీ వీధి ప్రాంతాల్లో ఈ సమస్య అధికంగా ఉంది. దీనిపై అధికారులు స్పందించి వీధి కుక్కల బారి నుంచి రక్షణ కల్పించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరచుకోవాలి



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వైద్య సిబ్బంది

ఐఎన్‌హెచ్‌ఎస్ కల్యాణి ఆస్పత్రి ఆధ్వర్యంలో అవగాహన

సింధియా: ఆరోగ్యకరమైన జీవనశైలి.. వ్యాధుల నియంత్రణపై ఐఎన్‌హెచ్‌ఎస్ కల్యాణి ఆస్పత్రి నేతృత్వంలో శుక్రవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని తూర్పు నావికాదళ పరిధిలో గల నేవల్ డాక్‌యార్డ్ ప్రాంతాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. 'ఆరోగ్యకరమైన జీవనారంభం–ఆశాజనక భవిష్యత్తు' థీమ్‌తో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సుమారు 200 మంది డాక్‌యార్డ్ సిబ్బందితో పాటు అప్రెంటిస్ ట్రైనీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆరోగ్య సంరక్షణలో భాగంగా 'మేము మా కార్మికులను టీకాతో కాపాడుతాం' శీర్షికతో టీకా డ్రైవ్‌ను చేపట్టారు.

అసంపూర్తి పనులతో అవస్థలు

నరకం చూస్తున్న వాహనచోదకులు



సింధియా జంక్షన్‌లో గుంతల రోడ్డుపై ఇబ్బంది పడుతూ ప్రయాణిస్తున్న ప్రజలు

సింధియా: పారిశ్రామిక ప్రాంతంలో ప్రయాణమంటేనే హడలిపోయే పరిస్థితి నెలకొంది. ఇక గుంతల రోడ్లపై ప్రయాణం నరకాన్ని తలపిస్తోందంటూ వాపోతున్నారు. ఇటీవల సింధియా జంక్షన్‌లో భూగర్భ విద్యుత్ లైన్ల కోసం ప్రధాన మార్గంలో గుంతలు తవ్వారు. పని పూర్తయినా గుంతలను పూర్తిగా మూయకుండా అసంపూర్తిగా వదిలేయడంతో ఈ మార్గంలో ప్రయాణిస్తున్న వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముందే సర్దార్ వల్లభాయ్ పటేల్ వంతెన మూసివేయడంతో సింధియా మీదుగా నగరానికి వెళ్లే ప్రయాణికులు 9 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి వస్తోంది. ఇప్పుడు గుంతల రోడ్లలో ప్రయాణమంటే మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా ఉందని విమర్శిస్తున్నారు. ఎక్కువ రద్దీగా ఉండే ఈ మార్గంలో గుంతలు పూడ్చి, రోడ్లు వేయాలని వాహనచోదకులు కోరుతున్నారు.

అల్లుకున్న నిర్లక్ష్యం

- విద్యుత్ స్తంభాలపై దట్టంగా లతలు
- పట్టించుకోని అధికారులు



విద్యుత్ స్తంభానికి అల్లుకున్న లతలు



52వ వార్డులో పగలే వెలుగుతున్న విద్యుత్ దీపం



క్రాంతినగర్‌లో పట్టపగలే వెలుగుతున్న వీధి దీపం

విశాఖ విద్య: ఎన్‌ఏడీ ఫ్లై ఓవర్ చుట్టూ ఉన్న రహదారుల్లో విద్యుత్ లైన్ల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. 52వ వార్డు గురజాడ నగర్ వైపు రహదారిలో ఉన్న విద్యుత్ స్తంభానికి పొదలు అల్లుకున్నా, వాటిని తొలగించేందుకు ఇటు జీవీఎంసీ అధికారులకు కానీ, అటు విద్యుత్ శాఖ వారికి గానీ తీరిక లేకపోవటంతో ఆ ప్రాంత వాసులకు అసౌకర్యంగా మారింది. విద్యుత్ స్తంభానికి లైట్లు ఏర్పాటు చేసినా, దాని చుట్టూ పొదలు అల్లుకున్న కారణంగా వెలుతురు సవ్యంగా రావడం లేదు. విద్యుత్ తీగలకు లతలు అల్లుకోవడంతో ఒక్కోసారి, షార్ట్ సర్క్యూట్ అవుతోందని, నిప్పు రవ్వలు కిందకు పడుతున్నాయని స్థానికులు తెలిపారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆందోళన చెందుతున్నారు.

పగలూ వెలుగులే..

ఇక్కడి విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన వీధి లైట్లు పగలు సైతం వెలుగుతున్నాయి. దీంతో వీటిని ఏర్పాటు చేసిన మూన్నాళ్లకే కాలిపోతున్నాయని పరిసర ప్రాంతాల వారు అంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వీధి దీపాల నిర్వహణపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

క్రాంతినగర్‌లో..

సింధియా: జీవీఎంసీ 63వ వార్డు పరిధి క్రాంతినగర్‌లోనూ పట్టపగలు విద్యుత్ దీపాలు వెలుగుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో రాత్రి వేళల్లో వీధి దీపాలు వెలగక ప్రజలు అవస్థలు పడుతుంటే, ఇక్కడ పట్టపగలు కూడా లైట్లు వెలుగుతున్నాయని, దీంతో విలువైన విద్యుత్ వృథా అవుతోందని పలువురు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని విద్యుత్ వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

పోషకాహారంతో తల్లీబిడ్డల ఆరోగ్యం పదిలం

ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ జయదేవి



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న పీడీ జయదేవి

విశాఖ విద్య: పౌష్టికాహారం ద్వారా తల్లీబిడ్డల ఆరోగ్యాన్ని పదిలంగా కాపాడుకోవచ్చని ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ జి.జయదేవి అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జీవీఎంసీ 90వ వార్డు లక్ష్మీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన పౌష్టికాహార పక్షోత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. కేంద్రానికి వచ్చిన గర్భిణులు, బాలింతలతో మాట్లాడి వారికి అందుతున్న పౌష్టికాహారం వివరాలను తెలుసుకున్నారు. చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. కేంద్రానికి వచ్చిన గర్భిణులు, బాలింతలు, చిన్నారులతో కలసి కాలనీలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ నెల 8 నుంచి 22 వరకు పౌష్టికాహార పక్షోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. గర్భవతిగా ఉన్నప్పుడు ఆరోగ్యంగా ఉంటే, తల్లీ బిడ్డకు శ్రేయస్కరమన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారం కోసం సకాలంలో పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏసీడీపీవో శ్రీలత, సెక్టార్ సూపర్‌వైజర్ జ్యోతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఆయాలు పాల్గొన్నారు.

రోడ్డుపైనే భవన నిర్మాణ సామగ్రి



రోడ్డుకు అడ్డంగా వేసిన ఇసుక

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు గౌరీ నగర్‌లో భవన నిర్మాణ సామగ్రిని రహదారిపైనే వేస్తున్నారు. అంతేకాకుండా భవనం నుంచి వచ్చే వృథా నీటిని కూడా రోడ్డుపైకి వదిలేస్తున్నారు. దీంతో ఆ దారిలో వెళ్లేందుకు వాహనదారులు, పాదచారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. భవన నిర్మాణానికి సంబంధించిన సామగ్రిని ఇలా రోజుల తరబడి వదిలేస్తుండటంతో పరిసర ప్రాంతాల వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ అధికారులకు ఇలాంటివి ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నిస్తున్నారు. వృథా నీరు రోడ్డుపై పారుతుండటంతో, ద్విచక్రవాహనాలు అటుగా వెళ్లేటప్పుడు ఆ మార్గంలో ప్రయాణిస్తున్న పాదచారులపై బురద పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డును ఆక్రమించి, ఇలా ఇతరులకు అసౌకర్యం కలిగిస్తున్న వారిపై జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

దివ్యాంగ చిన్నారుల్లో విభిన్న నైపుణ్యాలు పెంపొందించాలి



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఆచార్య నాగరాజకుమారి

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఐఏఎస్‌ఈ, ఏయూ విద్యా విభాగంతో సంయుక్తంగా జాతీయ విద్యా విధానం–2020, సహిత విద్యలో నూతన బోధనా పద్ధతులు అనే అంశంపై రెండు రోజుల పునరావాస విద్యా కార్యక్రమాన్ని(అధ్యాపకుల పునఃశ్చరణ తరగతులు) శుక్రవారం ఐఏఎస్‌ఈ ప్రిన్సిపాల్ ఆచార్య డి.నాగరాజకుమారి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ దివ్యాంగ చిన్నారుల్లో విభిన్న నైపుణ్యా లను పెంపొందించే దిశగా అధ్యాపకులు కృషి చేయాలన్నారు. రెండు రోజుల శిక్షణ తరగతుల్లో నిపుణులు అందించే సూచనలతో బోధన సామర్థ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. సదస్సు కో ఆర్డినేటర్, ఏయూ విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు అవసరమైన బహుళ నైపుణ్యాలను పెంపొందించడానికి పలు సాంకేతిక ఉపకరణాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రీ హాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఆర్‌సీఐ–న్యూఢిల్లీ) పూర్వ సభ్యులు ఆర్.రంగనాథన్, డాక్టర్ ఎం.ప్రభాకర్‌రావు, డాక్టర్ మదన్‌మోహన్, డాక్టర్ అన్నపూర్ణ తదితరులు అవగాహన కల్పించారు. ఆర్‌సీఐ సభ్యత్వం కలిగిన 50 మంది ప్రత్యేక ఉపాధ్యాయులు వృత్యంతర శిక్షణ కోసం హాజరయ్యారు.